వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు స్పెషల్ క్లాసులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఎనిమిదేళ్లుగా వీణవంక మోడల్ స్కూల్ వందశాతం ఉత్తీర్ణత


ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

వీణవంక: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. రెండు నెలల ముందు నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున గ్రూపుగా ఏర్పడి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎనిమిదేళ్లుగా మంచి ఫలితాలు సాధిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈసారి కూడా మంచి ప్రతిభ కనబర్చాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతో....

నిరుపేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం 2013లో మోడల్ స్కూళ్లను ప్రవేశపెట్టింది. ఉచిత విద్యతో పాటు వందమంది బాలికలకు హాస్టల్ వసతి కల్పిస్తోంది, ఎనిమిదేళ్లుగా విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ ఆదర్శంగా నిలిస్తున్నారు. గతేడాది94 మంది విద్యార్థులు ఉండగా 60మందికి పైగా 9.0జీపీఏ కంటే ఎక్కువగా సాధించి రికార్డు సృష్టించారు. ఈ ఏడాది 95మంది విద్యార్థులకుగాను 80 మంది 9జీపీఏ సాధించాలనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. మార్చిలో పరీక్షలు ఉండటంతో గతేడాది నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 7.45గంటల నుంచి 9గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. సబ్జెక్టులో ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారు. గ్రూప్ డిస్కషన్స్, స్లిప్‌టెస్టులు, కాంపెటేటీవ్ పరీక్షలు పెడుతున్నారు.

బస్సులు లేక ఇబ్బందులు...

మండల కేంద్రానికి మారుమూల ప్రాంతంలో పాఠశాల ఉండటం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. వల్భాపూర్, నర్సింగాపూర్, వీణవంక నుంచి వచ్చే విద్యార్థులు రెడ్డిపల్లి బస్టాప్ వద్ద బస్సు దిగి కాలినడకన స్కూల్‌కు వెళ్లాలి. ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి బేతిగల్, కనపర్తి గ్రామాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు నడిచేలా చొరవ తీసుకున్నారు. మిగిలిన గ్రామాలకు బస్సుసౌకర్యం ఇబ్బందిగా మారింది. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలనే పట్టుదలతో క్లాసులకు వెళ్తున్నారు.

10జీపీఏ సాధించాలనే పట్టుదలతో చదువుతున్న



రెండు నెలల ముందునుంచే సార్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వివిధ సబ్జెక్టులో సందేహాలు ఉంటే నివృత్తి చేస్తున్నారు. ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ సారీ 10జీపీఏ సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాను. మా స్కూల్ ఎనిమిదేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధించింది. వెనుకబడిన విద్యార్థుల మెలకువలు సూచనలు ఇస్తున్నారు.

– కూచన వర్షా, పదో తరగతి, మోడల్ స్కూల్

సమష్టి కృషితో పని చేస్తున్నాం



వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గత ఎనిమిదేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. గతేడాది 60మందికి పైగా విద్యార్థులు 9 జీపీఏ సాధించడం అభినందనీయం. ఉపాధ్యాయులు సమష్టి కృషితో పని చేస్తున్నారు. వారి సహకారంతోనే ఈ ఘనత సాధించాం. విద్యార్థులు కూడా పట్టుదలతో చదువుతున్నారు. ఈసారి కనీసం 80 మంది విద్యార్థులు 9 జీపీఏకుపైగా గ్రేడు సాధించేలా సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్

ఆలయ వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ



జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలోని శ్రీలక్ష్మీచెన్నకేశవసామి దేవాలయం వా ర్షికోత్సవ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు డింగరి ప్రవీణాచార్యులు, ఏలుబాక ఫణిశర్మ మాట్లాడుతూ గతేడాది జనవరి 24న శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించామని, ప్రథమ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 10,11,12,14 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజేందర్, మహేందర్, కౌన్సిలర్లు సుగుణ, శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి, వెంకటేశ్, తిరుపతి, మధు, సాయిలు, కోటి సమ్మయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

• పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

వీణవంక: పెళ్లి చేసుకుంటానని నమ్మించి శుభలేఖలు పంచిన తర్వాత మొఖం చాటేశాడు ఓ ప్రబుద్ధుడు. మండలంలోని మామిడాలపల్లికి చెందిన ఓ యువతికి ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాండ్ల శ్రావణ్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం నిశ్చితార్థం జరిగింది. ఫిబ్రవరి 11న పెళ్లి నిశ్చయించారు. యువతి కుటుంబ సభ్యులు వారి బంధువులకు పెళ్లి కార్డులు కూడా పంచారు. తీరా పెళ్లి సమయం సమీపిస్తుండగా పెళ్లి చేసుకోనని మోసం చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు శ్రావణ్‌కుమార్, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

క్రీడా దుస్తుల వితరణ

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌లోని వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్స్‌వారు రూ.35 వేల విలువ గల క్రీడా దుస్తులను మంగళవారం అందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు దుస్తులతో పాటు పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా సంస్థ యాజమానులు రేణుకదయానందరెడ్డిని హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామంలోని ఇరుకు రోడ్లతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు విస్తరణ కోసం నివాస గృహాలు తొలగించాలని ముందుకువచ్చారు. మంగళవారం సర్పంచ్ ఎడ్ల సువర్ణల సునీయంవిజయ్‌కుమార్ సమక్షంలో ఇళ్లను జేసీబీతో తొలగించారు. రోడ్డు విస్తరణ కోసం సహకరించిన ప్రజలకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

పంటల పరిశీలన

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల, కిష్టంపేట, మల్లన్నపల్లి గ్రామాల్లో వరి పంటను హుజూరాబాద్ ఏడీఏ సునీత పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, జింకు లోపం ఎక్కువగా ఉందని, జింక్ లోపం నివారణకు లీటర్ నీటిలో జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచుకారీ చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు ఆశించిన పొలంలో 15–20రోజుల వ్యవధిలో ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 8కిలోలు వేసుకోవాలని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏఈవో రాకేశ్ పటేల్ ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ అనూష, వైస్‌ఎంపీపీ రమేశ్, ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి హుండీ లెక్కింపు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామం శ్రీమల్లికార్జునస్వామి హుండీని మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.1,82,597 వచ్చాయని తెలిపారు. అనుబంధ శ్రీరేణుక ఎల్లమ్మ, దుర్గమ్మతల్లి, పోచమ్మతల్లి ఆలయాల హుండీ లెక్కించ రూ.98,337, స్వామివారి ఆర్జిత సేవ, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.35.716, స్వామివారి కల్యాణమహోత్సవం విరాళాలు రూ.48.544, స్వామివారికి వెండి కానుకలు 28.5 తులాలు వచ్చినట్లు తెలిపారు. జాతర విజయవంతం కావడానికి కృషి చేసిన అందరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్షిత ఆత్మహత్యపై విద్యార్థి సంఘాల ఆందోళన

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థిని అక్షిత ఆత్మహత్యను నిరసిస్తూ మంగళవారం విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థిని తల్లిదండ్రుల అనుమతి లేకుండా మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి ఎలా తరలించారని, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కళాశాల ప్రిన్సిపాల్, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులకు నచ్చజెప్పి పంపించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపారు.

మహాత్మా గాంధీకి నివాళి


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్‌కుమార్, జిల్లా రైస్ మిల్లర్ల మాజీ అధ్యక్షుడు బచ్చు భాస్కర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు చందరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అతిథిగా హాజరై గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, మాడ గౌతంరెడ్డి, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, తూర్పాటి రాజు, దొంతుల రాజ్‌కుమార్, రాజేశ్ ఠాకూర్, కైలాస కోటి గణేశ్, మోడెం రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఇల్లందకుంట: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ, సమగ్ర బాలల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో హుజూరాబాద్ సీడీపీవో భాగ్యలక్ష్మి అధ్యక్షతన బాలల పరిరక్షణపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ పావని కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు విధివిధానాలు బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల గూర్చి గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్త, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ గ్రామస్థాయి అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. 18సంవత్సరాల లోపు పిల్లల సమస్యలు కమిటీ దృష్టికి తీసుకురావాలని, పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారాం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ శంకర్, సీడీపీఓ భాగ్యలక్ష్మి, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 సూపర్‌వైజర్ దూడం కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీఎం రమ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసిదాస్, భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ, హెడ్ కానిస్టేబుల్, పూజారులు, పాస్టర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం


తిమ్మాపూర్ నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ త్వరలో నెరవేరుస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా తిమ్మాపూర్ లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, భూమిపూజ చేశారు. నూతన గ్రామ పంచాయతీ భవనం, వాటర్ ప్లాంట్, క్రీడా మైదానాలు ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. మన్నెంపల్లి గ్రామంలో క్రీడామైదానం, వైకుంఠధామం, హరితహారం నర్సరీ కేంద్రాన్ని ప్రారంభించారు. పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. జూగుండ్ల గ్రామంలో అంబేడ్కర్, కురుమ, మహిళా సంఘాల నూతన భవనాలను ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మంచి పాలన అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, సర్పంచులు దుండ్ర నీలమ్మ, మేడి అంజయ్య, సాయిల్ల ఎల్లేశ్, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వ హిందూ పరిషత్ నూతన కార్యవర్గం


ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామం విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడు కంకణాల రమేశ్‌రెడ్డి, కార్యదర్శి బాషబోయిన చంద్రయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడిగా రావుల సురేశ్, ఉపాధ్యక్షులుగా పంజాల రవిశాస్త్రి, కార్యదర్శిగా సట్ల నవీన్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో బజరంగదళ్ ప్రముఖ మార్కశివ, గోరక్ష ప్రముఖ రావుల కరుణకర్, కోశాధికారి పింగళి దేవేందర్‌రెడ్డి, సభ్యులు నీలం కిషన్, కందికొండ రెడ్డి, సల్పుల దేవేందర్, సలుపుల రాకేశ్, మోడం సాయి, మండల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారలమ్మ జాతర కమిటీ

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ సమ్మక్క, సారలమ్మ జాతర కమిటీ నూతన చైర్మన్‌గా దుంపల జీవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా మండల తిరుపతి, బద్దెనపల్లి రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా బొడిగె రాజశేఖర్, కోశాధికారిగా కోలపురి హన్మంతు, సహాయ కార్యదర్శిగా సంకరి మోహన్, సహాయ కార్యదర్శులుగా రామడుగు ప్రశాంత్, ఆకుల సత్తయ్య, గౌరవ అధ్యక్షుడిగా అప్పిడి శ్యాంసుందర్‌రెడ్డి, బత్తుల లక్ష్మినారాయణ, ముఖ్య సలహాదారులుగా వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, అంజయ్య, లక్ష్మణ్‌గౌడ్, విజయ్‌కుమార్, బాపురెడ్డి ఎన్నికయ్యారు.

నేడు సన్మాన కార్యక్రమం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం పంచాయతీ పాలకవర్గం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నామని సర్పంచ్ వీర్ల సరోజన ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

శంకరపట్నం: మండలంలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు తెలిపారు. జాతర ప్రాంగణాన్ని మంగళవారం పరిశీలించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ మొగిలి, కార్యదర్శి నరసయ్య, జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

నగదు, బహుమతుల ప్రదానం



రామడుగు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం పద్మజ

మానకొండూర్: గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.మణితేజ, ఎం. వరలక్ష్మికి హెచ్‌ఎం డి.శ్రీనివాస్ రూ.పదివేల పురస్కారం మంగళవారం అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదివి ఉన్నతస్థాయికి ఎదిగి స్వర్గస్తులైన నారాయణగౌడ్ జ్ఞాపకార్థం వారి ప్రతినిధి నరహరిగౌడ్ నగదు అందజేశారని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు జ్యోతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న హెచ్‌ఎం డి. శ్రీనివాస్

స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. గోనె వైష్ణవి, పల్లి ప్రణయతో పాటు పలువురు విద్యార్థులు విజేతలుగా నిలవడంతో వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్, హెచ్‌ఎం పద్మజ, ఇంగ్లిష్ టీచర్లు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి సహకరించాలి


పూలమాల వేస్తున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: దళితుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, విద్యతోనే వెనుకబాటు తనం దూరమవుతుందని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని మంగళపల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, ఉపసర్పంచ్ పెద్దెల్లి సురేశ్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నాగరాజు, గాండ్ల లక్ష్మణ్, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ మధు

హుజూరాబాద్: 19 సంవత్సరాలలోపు పిల్లల్లో నులిపురుగుల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది కృషి చేయాలని చెల్పూరు వైద్యాధికారి డాక్టర్ మధు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నేషనల్ డీవార్మింగ్ డే అల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఫిబ్రవరిలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగాలు గ్రామస్తుల హర్షం


స్వాతి


శిరీష


తిరుపతి

సైదాపూర్: మండల కేంద్రానికి చెందిన పేదింటి పిల్లలు వైద్యశాఖలో ఉద్యోగాలు సాధించారు. ఈసందర్భంగా సర్పంచ్ చందా శ్రీనివాస్, కూతురు విద్యాన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు పొడిశెట్టి రాజులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. యటపోల స్వాతి, దండవేన శిరీష స్టాఫ్‌నర్సు, మొలుగూరి తిరుపతి గురుకులంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దు


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: గ్రామాల్లో పలువురు నకిలీ మందులు విక్రయిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో మాట్లాడారు. పేదలు చిన్న వ్యాధులకు మెడికల్ షాపులను ఆశ్రయిస్తే ఇష్టానుసారంగా నకిలీ మందులను విక్రయిస్తున్నారని ఆరోపించారు. మెడికల్ మాఫియాపై డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రజలు అనారోగ్యానికి గురై ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. అధిక ధరలకు విక్రయస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.